## క్లుప్తంగా

### 142 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని గీతా భవనంలోఆదివారం లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు పేదలకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 142 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి 18 మందికి ఆపరేషన్ చేయాల్సిందిగా నిర్ధారించారు. వారిని పరమహంస హాస్పిటల్‌కు తరలించారు. ఈ సందర్భంగా 34 మందికి కళ్లజోళ్లు సబ్సిడీపై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నై వెంకటరామయ్య, పి.విఠల్ శిబిరానికి హాజరైన వారికి సేవలు అందించారు. అవసరం ఉన్నవారికి ఐ డ్రాప్స్, టాబ్లెట్స్ ఉచితంగా పంపిణీ చేశారు.

### వైభవంగా క్రిస్మస్ ర్యాలీ



విశ్వాసులకు ర్యాలీ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్న పాస్టర్ జ్యోతిరాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శాంతినగర్‌లోని మన్నా చర్చి ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ సువార్త ర్యాలీ వైభవంగా నిర్వహించారు. ఏసు క్రీస్తు జన్మకు సంబంధించిన వివిధ అలంకరణలతో విశ్వాసులు ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత స్థానిక సత్రంపాడు పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల గుండా నగరమంతా కొనసాగింది. క్రిస్మస్ ప్రాముఖ్యతను, ఏసు బోధనలను ప్లకార్డుల ద్వారా ప్రచారం చేశారు. ఈ ర్యాలీలో క్రీస్తుకు సంబంధించిన పాటలతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పాస్టర్ ఎం. జ్యోతి రాజు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి దారి పొడవునా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బిషప్ ఎలీషా రాజు, పాస్టర్లు పాల్గొన్నారు.

### ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆదివారం ఆవిష్కరించారు. ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో డైరీని ఆవిష్కరించారు. పలువురు ఎస్టీ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

# ఆక్రమణ చెరలో కోడేలు పంట కాలువ

- యథేచ్ఛగా దుకాణాల నిర్మాణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- మురుగు డ్రెయిన్‌గా మారిన కాలువ



కోడేలు వంతెన సమీపంలో కాలువపై ఆక్రమణలు



బావిశెట్టివారిపేట వద్ద కోడేలు పంట కాలువలో కల్వర్టు నిర్మిస్తున్న దృశ్యం



కృష్ణా కెనాల్ వద్ద శిథిలమవుతున్న కోడేలు కాలువ స్లూయిజ్

ఏలూరు రూరల్ : కోడేలు పంట కాలువ ఆక్రమణపై రైతులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలువ గట్టును ఆక్రమించి దుకాణాలు, భవనాలు, కల్వర్టులు నిర్మిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఫలితంగా కాలక్రమేణ పంటకాలువ మురుగు డ్రెయిన్‌గా మారుతోందంటున్నారు. భవిష్యత్తులో వందలాది ఎకరాలకు సాగునీరు పారుదల ప్రశ్నార్థకమవుతోందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

**కుంచించుకుపోయిన కాలువ**

సుమారు 80 ఏళ్ల క్రితం కోడేలు రోడ్డు వద్ద కృష్ణా కెనాల్‌కు నీటి పారుదలశాఖ అధికారులు స్లూయిజ్ నిర్మించారు. దీని గుండా కోడేలు, చాటపర్రు పరిసర గ్రామాల పంట చేలకు కాలువ ఏర్పాటు చేసారు. సుమారు 50 అడుగుల వెడల్పు కలిగిన ఈ కాలువ గుండా వందలాది ఎకరాలకు సాగునీరు సరఫరా అయ్యేది. ఇప్పుడు ఈ పరిస్థితి కానరావడం లేదు. స్లూయిజ్ నుంచి బావిశెట్టివారిపేట మీదుగా కోడేలు పరిసరాల వరకూ కాలువ గట్లపై అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రధానంగా కోడేలు వంతెన దిగువన నాలుగు రోడ్ల కూడలి వద్ద కాలువపై పలు దుకాణాలు నిర్మించారు. స్థానిక శ్రీసుముఖ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ భవనం వద్ద కాలువను ఆక్రమించి కల్వర్టు నిర్మిస్తున్నారు. ఇలా ఒక్కొక్కటిగా ఆక్రమణలు పెరిగిపోవడంతో రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అడ్డుకోకపోతే కాలువ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే దిగువన పంట చేలకు సాగునీరు సరఫరా మరింత జటిలమవుతుంది.

### ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు



స్థానిక శ్రీసుముఖ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ భవనం యజమాని పంట కాలువను ఆక్రమించి, కల్వర్టు నిర్మించారు. దీనిపై కొద్ది నెలల క్రితం గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేసాను. ఇరిగేషన్ ఏఈ వచ్చి పరిశీలించి, భవన యజమానికి నోటీసు ఇచ్చారు. కాని ఆక్రమణలు తొలిగించలేదు. ఇప్పటి వరకూ సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై జిల్లా అధికారులు స్పందించాలి.

– పల్లి భూలోకరావు, చాటపర్రు నీటి సంఘం మాజీ సభ్యుడు

### అనుమతులు ఎలా ఇచ్చారు?



కాలువ గట్లు ఆక్రమించి భవనాలు, దుకాణాలు నిర్మించడానికి కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఎలా ఇస్తున్నారో అర్థం కావడం లేదు. కొన్నేళ్ల క్రితం వరకూ కాలువ విశాలంగా ఉండేది. స్వచ్ఛమైన నీరు పారేది. ఇప్పుడు కుచించుకుపోయింది. దుర్గంధం వెదజల్లుతూ మురుగునీరు పారుతోంది. డ్రెయినేజీ పైప్‌తో పాటు సెప్టిక్ ట్యాంక్ పైపులు కూడా కాలువకు కలిపేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ

### సమస్యను పరిష్కరించాలి



ఈ ప్రాంతంలో రోజురోజుకూ ఆక్రమణలు పెద్ద సమస్యగా తయారవుతోంది. కాలువ గట్లను యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. కాలువ ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి. మరోపక్క రోడ్డు రద్దీగా మారుతోంది. నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి.

– బి.జోగేంద్ర, స్థానికులు

### ముందుగానే అడ్డుకోవాలి



పంట కాలువ ఆక్రమణలను అధికారులు ముందుగానే అడ్డుకోవాలి. భవనాలు, దుకాణాలు నిర్మించిన తర్వాత నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. అధికారులు పట్టించుకోకపోతే ఆక్రమణలు మరిన్ని పెరిగిపోతాయి. భవిష్యత్తులో ఈ కాలువతో పాటు రోడ్డును అభివృద్ధి చేయాలి. లేదంటే మరిన్ని సమస్యలు వస్తాయి.

– మాతా గోవర్ధనరావు, స్థానికులు

## తురగా సేవలు అభినందనీయం



తురగా రామకృష్ణ దంపతులను సన్మానిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన విద్యుత్ సంస్థ ఉద్యోగి తురగా రామకృష్ణ వివిధ రంగాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ 29వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు సేవా తపస్వి అవార్డులను బహూకరించింది. అవార్డు అందుకున్న వారిలో తురగా రామకృష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు తురగా రామకృష్ణ అభినందన సభ స్థానిక అమీనాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణ ఐకాస నాయకుడిగా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, విద్యుత్ ఉద్యోగిగా విభిన్న రంగాల్లో ఆయన చేస్తున్న సేవలు భవిష్యత్తులో మరింతగా విస్తరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.వేణుబాబు, డి. సుబ్బారావు, లేళ్ల వెంకటేశ్వరరావు, పామర్తి అచ్యుత్ గౌడ్, కడియాల విజయలక్ష్మి, సాదం కిషోర్, వి.కృష్ణమోహన్, వి.యుగంధర్, బ్రాహ్మణ ఐకాస నాయకులు కె.రవి, బి.సుబ్రహ్మణ్యం, వీవీవీ హనుమంతరావు, ఈ.సుబ్బారావు, టీఆర్ శర్మ, ఎన్జీవో నాయకులు ఎం. సాంబశివరావు, విద్యుత్ నాయకులు ఎస్.నరసింహారావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొని తురగా రామకృష్ణను ఘనంగా సన్మానించారు.

## సాబ్జీ మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు



దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఎన్‌జీఓ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూటీఎఫ్ సంఘం ద్వారా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం దివంగత షేక్ సాబ్జీ ప్రథమ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ రవికుమార్ రుద్రాక్షి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్లు నెరుసు రామారావు, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్‌ఎస్ హరనాథ్, సాబ్జి సతీమణి సుభాన్ బేగం తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోపిమూర్తి ఎమ్మెల్సీగా విజయం సాధించడానికి సహకరించిన వివిధ సంఘాల ప్రతినిధులతో అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌కు మద్దతు తెలిపిన ఏపీటీఎఫ్ 1938, బీటీఏ, ఆదిమవాసి టీచర్స్ అసోసియేషన్ నాయకులు జీ. మోహన్, గుడిమెల్ల వెంకటేశ్వరరావు, ఎంఈఓల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సబ్బితి నరసింహమూర్తి, ప్రజా సంఘాల నాయకులు, ఆర్టీసీ, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌ఎస్ ప్రసాద్ హాజరై జనవరి 5 నుంచి 8వ తేదీ వరకూ కాకినాడలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను 20వేల మందితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సభలకు వేలాది మంది ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సభల్లో ఉపాధ్యాయుల, విద్యార్థుల, పాఠశాలల సమస్యలపై చర్చిస్తారన్నారు.

## ముగిసిన ప్రభుత్వ డ్రైవర్ల సంఘ సమావేశం



ఉమ్మడి ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు రూరల్: సర్వీసులో ఉన్న డ్రైవర్లు ప్రమాదశాత్తు మరణిస్తే సంఘం తరుపున రూ.15,000 నగదు సహాయం అందజేస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం నూతన అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఏలూరులోని సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల కుటుంబంలో ఆడపిల్ల పెళ్లికి రూ.5వేలు, అబ్బాయి పెళ్లికి రూ. 3వేలు అందిస్తామన్నారు. ఇదే క్రమంలో ప్రమాదంలో గాయపడిన సభ్యులకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం రూ. 5వేలు అందిస్తామని వివరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు డీఎస్ కొండయ్య, సలహాదారుడు వై నాగరాజు సమక్షంలో సభ్యులు పీఆర్సీ, ఇళ్ల స్థలాలు, ఎల్‌ఎంవీ, హెచ్‌ఎంవీ డ్రైవర్ల పదోన్నతులపై చర్చించారు. సమావేశంలో వైజీఎల్ నారాయణ, వేణుగోపాల్‌స్వామి, జి ఈశ్వరరావు, పీఎస్‌ఆర్‌కే లింగేశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

### రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి చేరి వచ్చిన ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వెలసిన రాట్నాలమ్మ తల్లికి ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో భక్తులు దేవస్థానానికి చేరుకుని అక్షరాభ్యాసాలు, నామకరణలు, తదితర మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారి పూజా టికెట్లపై రూ.31,730, లడ్డూ ప్రసాదంపై రూ.27,375, ఫొటోల విక్రయంతో రూ.1,885, విరాళంపై రూ.9,452, మొత్తం రూ.70,442 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

### క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

దెందులూరు: హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం.లావణ్య అన్నారు. ఆదివారం దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని వేగవరంలో హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో కాలేజీ ప్రిన్సిపల్ ఎం.లావణ్య, కళాశాల ఏవో కరుణానిధి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లావణ్య మాట్లాడుతూ 16వ తేదీ నుంచి ఈనెల 21వ తేదీ వరకు కాకినాడ జేఎన్‌టీయూ పరిధిలోని యూనివర్సిటీ స్థాయిలో బాలుర విభాగంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని కాలేజీ ఆవరణలో యూనివర్సిటీ స్థాయి బాలుర క్రికెట్ పోటీల్లో 65 టీంలు పాల్గొంటారని వారు తెలిపారు. వారికి అవసరమైన క్రీడా మైదానం అభివృద్ధి చేయడంతోపాటు వారికి సహాయ సహకారాలు అందించేందుకు మేనేజ్‌మెంట్ చర్యలు తీసుకుందని తెలిపారు.

## నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్థానిక అగ్రహారంలోని భూ నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి జనవరి 19వ తేదీ వరకూ ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్వామి వారి సన్నిధిలో ప్రథమ పాశుర విన్నపం నిర్వహించనున్నారు. జనవరి 9న నాచ్చియార్ తిరుక్కోలం నిర్వహించి స్వామి వారిని జగన్మోహినిగా అలంకరిస్తారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి నుంచి 19వ తేదీ వరకూ స్వామి వారికి అలంకారోత్సవం నిర్వహిస్తారు. 11న ఆండాళ్లు, తాయార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం, 13న గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. స్థానిక పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకూ ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. 13న గోదా వాసుదేవ స్వామి కల్యాణం నిర్వహిస్తారు.

### అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

దెందులూరు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వం వ్యాయామ విద్య కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం రాజమండ్రిలోని నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయి ఓవరాల్ చాంపియన్‌షిప్ తమ కళాశాలకు రావడం సంతోషంగా ఉందన్నారు.

## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. నారాయణ రావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్‌కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ గురుకుల పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలపై వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కార్యక్రమం అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 36 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 41 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 08 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 27 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 20 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 27 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 27 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 19 |
| ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 19 |
| ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 28 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 27 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 09 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 31 |

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 16-20 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 40 |
| వంకాయలు (కాంతులు) | 34 | చామదుంపలు | 44 |
| వంకాయలు (తెలుపు) | 34 | ములక్కాడలు | 10, 15 |
| బెండకాయలు | 30-34 | కంద | 60 |
| పచ్చిమిర్చి | 24-28 | బీట్‌రూట్ | 54 |
| కాకర కాయలు | 28-36 | కీరా దోస | 44 |
| బీరకాయలు | 28 | ఫ్రెంచ్‌బీన్స్ | 80 |
| బీరకాయలు (పందిరి) | 48 | అల్లం | 70 |
| క్యాబేజీ | 30-36 | కొత్తిమీర (కట్ట) | 20 |
| క్యారెట్ | 56 | పాలకూర | 10 |
| దొండకాయలు | 30 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 38 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 36-55 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 26 | పుదీనా | 05 |
| దోసకాయలు | 20-24 | బఠాణీ | -- |
| ఆనబకాయ (1) | 20-25 | క్యాప్సికమ్ | 76 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకదదుంప | 36 |

## ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



గారపాటి హైమావతి పాఠశాలలో కలుసుకున్న 1985 బ్యాచ్ విద్యార్థులు

దెందులూరు: స్నేహం ప్రతి ఒక్కరికీ దేవుడిచ్చిన వరమని ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ అందరూ 40 ఏళ్ల తర్వాత కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థి, దెందులూరు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ గారపాటి కొండయ్య చౌదరి, పూర్వ విద్యార్థి చింతలపూడి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బి శేఖర్, ప్రముఖ బిల్డర్ వి సురేష్, ఏలూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యాషియర్ కె అజరయ్య అన్నారు. దెందులూరు మండలం దెందులూరు శ్రీ గారపాటి హైమావతి దేవి ఉన్నత ప్రభుత్వ హైస్కూల్లో 1985-86 ఆర్థిక సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలిసి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. వ్యాఖ్యాతగా వ్యవహరించిన హెచ్‌ఎం బోదుల శేఖర్ మాట్లాడుతూ 40 ఏళ్ల అనంతరం బాల్య స్నేహితులను కలుసుకునేందుకు పలువురు దూర ప్రాంతాలనుంచి రావడం సంతోషదాయక మన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన మిత్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ కలిసి పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి, సహపంక్తి భోజనాలు చేశారు. సీనియర్ ఉపాధ్యాయుల ను పూర్వ విద్యార్థులందరూ కలిసి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఎన్ రాధాకృష్ణ, కే ప్రభాకర్, వై రామకృష్ణ, ఎం వెంకటేశ్వరరావు (వెంకన్న), ఇంజనీరింగ్ కాలేజీ టెక్నికల్ అసిస్టెంట్ మాగంటి సీతారాంప్రసాద్, ఎన్ మారనాథరాజు, పూర్వ విద్యార్థినులు రోజా, రాణి, జయలక్ష్మి పద్మ, సత్యవతి, రాజేశ్వరి, విజయ నిర్మల ఉన్నారు.